క్లుప్తంగా

వీఎస్సార్ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్



తెనాలిఅర్బన్: వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌ను మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం వంటలను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, అధ్యాపకులు ఎం.స్వర్ణకుమారి, డాక్టర్ నన్నపనేని సుగుణ, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

తెనాలిఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యుడు ఆళ్ల తిరుపతయ్య తన కుమార్తె కీర్తి, అంజన పుట్టిన రోజును పురస్కరించుకుని తెనాలి జిల్లా వైద్యశాలలోని రోగులకు గురువారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

26న రజక ఆత్మగౌరవ సభ

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26న రజక ఆత్మగౌరవ మహాసభను నాగార్జున యూనివర్సిటీ ఎదురు చిట్యాల ఐలమ్మ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రాచకొండ జాన్‌బాబు తెలిపారు. అరండల్‌పేటలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట సభల్లో రజకులకు తగిన ప్రాధాన్యత, రజక మహిళల భద్రతకు ప్రత్యేక చట్టం ఏర్పాటుతో పాటు పలు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రజక సంఘాల నాయకులు గుంటగల సాంబశివరావు, వాడాల నాగరాజు, కొల్లూరి శివ, తుమ్మేటి కృష్ణ పాల్గొన్నారు.

దర్గా ఉరుసు మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పొన్నూరు: దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కడప 'అమీన్ పీర్ దర్గా'లో ఈనెల 26 నుంచి జరిగే ఉరుసు మహోత్సవాలలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కిలారి వెంకట రోశయ్య కోరారు. పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం కడప దర్గా ఉరిసే షరీఫ్ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యుడు ఎండీ. మునీర్ మాట్లాడుతూ కడప దర్గాలో ఈనెల 26న గంధ మహోత్సవం, 27న ఉరుసు, 28న సభాఖాని, 29న ఖవ్వాలి, 30న జులుసు కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరిఫ్, అమీన్ పీర్, సుభాని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై కనకదుర్గ వారధి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో గురువారం ముగ్గురికి గాయపడ్డారు. వివరాలు.. కనకదుర్గ వారధిపై విజయవాడ నుంచి చిలకలూరిపేట వెళుతున్న తండ్రీ కొడుకులైన సత్తియేటి పోలయ్య, శ్రీనివాసరావులను వారధి దాటిన తరువాత వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన విజయవాడ రాజరాజేశ్వరిపేటకు చెందిన సోమిరెడ్డి ఏసురత్నం బైక్‌తో ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ముగ్గురిని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం

గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ టీటీకే రెడ్డి



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి అన్నారు. కళాశాల 1998 బ్యాచ్ విద్యార్థులు రూ. 20 లక్షలతో మైక్రోబయాలజీ లెక్చర్ గ్యాలరీని ఆధునీకరించి, స్మార్ట్ బోర్డు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి గురువారం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు జింఖానా పేరుతో మాతృ సంస్థ అభివృద్ధికి చేస్తున్న సేవ దేశవ్యాప్తంగా అందరి ప్రశంసలు పొందిందని తెలిపారు. లెక్చర్ గ్యాలరీని ఆధునీకరణ, స్మార్ట్ బోర్డు ఏర్పాటుకు సహకరించిన పూర్వ వైద్య విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, 1998 బ్యాచ్ పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్ రామోహన్‌రావు, డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

మంచి జరిగిందని భావిస్తేనే ఓటు వేయండి

- ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన సీఎం వైఎస్ జగన్
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్



ఏపీకి జగనే ఎందుకు అవసరం పుస్తకాని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేయటం ద్వారా ప్రతి ఇంట్లో అనేక మంది లబ్ధిపొందారని, అలా మంచి జరిగిందని భావిస్తేనే వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. 19వ వార్డులోని పెరుగు మార్కెట్–2 సచివాలయం వద్ద గురువారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవరత్నాలు పథకాలను ప్రభుత్వంలోకి వచ్చిన తొలిరోజుల నుంచే అమలు చేయటం జరిగిందని చెప్పారు. వాటి ద్వారా అనేక మంది పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణాలలోని పేదలకు మేలు చేసినట్లు వివరించారు. ఆ పథకాలు నిరంతరం కొనసాగాలంటే తమ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికలలో ఆశీర్వదించాలని కోరారు. దేశంలోని ఏ రాజకీయ పార్టీ ఇంత ధైర్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని చెప్పారు. ప్రజలకు మేలు చేసి, మరలా ప్రజల ముందుకు ధైర్యంగా వస్తున్నామన్నారు. ఇంత సంక్షేమాన్ని ఇచ్చిన సీఎం జగన్‌కు ప్రజలు ఓటు ద్వారా మరోసారి కృతజ్ఞతలు చెప్పాలని ఎమ్మెల్యే శివకుమార్ కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ ఎం.జశ్వంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. పట్టణంలోని ఒక్కో వార్డులో రూ.10 నుంచి రూ. 20 కోట్లకు పైగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి జరిగిందని చెప్పారు. పథకాల అమలులో ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు అవసరం అనే బుక్‌లెట్, వార్డు సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు తెలియజేసే బోర్డులను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–1 కన్వీనర్ మద్దాలి శేషాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు చుండూరు సాయి, మేనేజర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల జీవితాలపై ఎక్స్‌రే 'అర్ధనారి'

- మోడర్న్ మాస్టర్ పీస్‌గా గుర్తింపు
- రేపు తెనాలిలో నవలపై చర్చా వేదిక
- రచయిత బండి నారాయణస్వామి, హిజ్రా ఉద్యమ నేతల రాక



రచయిత బండి నారాయణస్వామి

తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో ప్రతి నెలా నిర్వహిస్తున్న చర్చావేదికకు ఈ నెల 25న బండి నారాయణస్వామి రచించిన 'అర్ధనారి' నవలను ఎంపిక చేశారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు జరగనున్న సభకు జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. నవల రచయిత బండి నారాయణస్వామి, ట్రాన్స్, హిజ్రా రైట్స్ యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన, ట్రాన్స్ బుద్ధిస్ట్ సన్యాసిని తాషి చోడుప్ క్వియర్, 'చినుకు' రాజగోపాల్, హిజ్రా లీడర్, ఫౌండర్ టీటీపీఏ కేఎస్‌వీ మోనాలిసా చర్చలో పాల్గొంటారు.
అర్ధనారి నవల ట్రాన్స్‌జెండర్ వాస్తవికత గురించిన బహుముఖ చిత్రణ. ఈ వస్తువుకు సమాంతరంగా పడుపువృత్తిని గురించిన మరో కథనం ఉంది. రెండు సమస్యల వెనకా పితృస్వామిక సమాజాన్ని విస్తర విశ్లేషణకు గురిచేయటం ఉంది. హిజ్రాల జీవితంపై తెలుగులో అర్ధనారిలో చేసినంత వివరంగా, అంత లోతుగా డీల్ చేయటం గతంలో ఎన్నడూ జరగలేదు. 'తానా' నవలల పోటీల్లో బహుమతి పొందిన అర్ధనారిని 'మోడర్న్ మాస్టర్‌పీస్'గా వెంకట్ శిద్దారెడ్డి అభివర్ణించారు.
దిగువ మధ్యతరగతి బహుజన వ్యవసాయ కుటుంబానికి చెందిన చంద్రన్న అనే యువకుడు రమణిగా పరిణమించిన క్రమంలో.. ట్రాన్స్‌జెండర్ వ్యవస్థ నిర్మాణాన్నీ, అందులోని ఖాన్‌దాన్‌లను, గురువులను, నానీలను, చేలలనూ, వారి జీవన విధానాన్నీ రోజువారీ ఆచరణ, ఆచార సంప్రదాయాలతో సహా అక్షర బద్ధం చేశారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం పట్టణ కేంద్రంగా ఈ మొత్తం ఇతివృత్తాన్ని అభివృద్ధి చేశారు. మరో పక్క కింద తరగతి బహుజన గ్రామీణ కుటుంబం నుంచి వచ్చిన ముగ్గురు పిల్లల తల్లి రామలక్ష్మి భర్త చేతిలో మోసపోయి సెక్స్‌వర్కర్‌గా పోలీసులు, రౌడీలు, రాజకీయ అండ కలిగిన పడుపువృత్తి కంపెనీలు, ఇరుగుపొరుగు తనపై చేసే దాష్టీకంతో అవమానాల మధ్య చేసిన ఒంటరి పోరాటాన్ని వాస్తవంగా చిత్రీకరించారని ప్రసిద్ధ సాహితీవేత్త జి.లక్ష్మీనరసయ్య అంటారు. అనుకోకుండా పరిచయమైన చంద్రన్న, రామలక్ష్మి ఒకరికొకరు అండగా నిలుస్తారు. ట్రాన్స్‌జెండర్‌గా చంద్రన్న, సెక్స్‌వర్కర్‌గా రామలక్ష్మి తమ తమ హక్కుల కోసం వారివారి ప్రత్యేక ఉద్యమాల్లో భాగమవుతారు. అర్ధనారి చదివాక మనకు జీవితంపై ఉన్న దృక్పథం మారుతుందని లక్ష్మీనరసయ్య అంటారు. హిజ్రాలపై ఇంత వివరంగా తెలుగులో వచ్చిన తొలి నవల అర్ధనారి మాత్రమే. 'తానా' నవలలో పోటీల్లో నగదు బహుమతినీ అందుకుంది.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నాజరుపేటకు చెందిన 19 ఏళ్ల అఖిలకు మూడు నెలల క్రితం వివాహమైంది. ప్రైవేటుగా ఇంటర్ సెకండియర్ చదువుతన్న ఆమె ట్యూషన్‌కి అని చెప్పి బుధవారం ఇంటి నుంచి వెళ్లింది. రాత్రికి తిరిగి రాకపోవడంతో భర్త, కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు గురువారం రాత్రి నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు బాబు ప్రసాద్

తెనాలిఅర్బన్: కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ తెలిపారు. చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చిందని, వాటి రద్దు కోసం అనేక పోరాటాలు చేసి విజయం సాధించినట్లు తెలిపారు. రైతుల డిమాండ్‌లను ప్రభుత్వం తీర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జోసేఫ్, వెంకటసుబ్బయ్య, శేషగిరిరావు, శివరామకృష్ణ, ఆశోక్‌కుమార్, నాగరాజు, సాంబశివరావు, బ్రహ్మరెడ్డి, షేక్ హుస్సేన్‌వలీ పాల్గొన్నారు.

నగరంలో ఈట్ స్ట్రీట్

- రాజాగారి తోటలో స్థల పరిశీలన
- రాత్రి 10 గంటల నుంచి ప్రారంభం



రాజాగారి తోటలో పర్యటిస్తున్న మేయర్ కావటి, తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: నగరంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గాంధీ పార్కు వెనుక వైపు (రాజా గారి తోట) ప్రతిపాదిత ప్రాంతాన్ని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నగరపాలక సంస్థ, పోలీసు అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరానికి హాస్పిటల్, వ్యాపార, విద్యా సంబంధ పనులపై నిత్యం వేలాది మంది సుదూర ప్రాంతాల నుంచి వస్తారని, వీరంతా రాత్రి 10 గంటల తరువాత సరైన భోజనం దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో కరోనాకి ముందు హిందూ కాలేజీ సెంటర్‌లో ఫుడ్ కోర్టు ఉండేదని, నిబంధనల ప్రకారం దాన్ని ఆపి వేశామని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యల వల్ల సదరు ప్రాంతంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు కూడా నిలిపి వేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఈట్ స్ట్రీట్‌ను ట్రాఫిక్‌కు అడ్డంకులు లేకుండా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడ, తిరుపతి, వైజాగ్ నగరాల్లో ఇప్పటికే ఏర్పాటు చేశారని, వాటిని పరిశీలించి అదే తరహాలో గుంటూరు నగరంలో కూడా గాంధీ పార్కు వెనుక ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పార్కు వెనుక రోడ్డు 250 మీటర్లు ఉందని తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి ఈట్ స్ట్రీట్ మొదలవుతుందని, ఉదయానికి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తామని వివరించారు. నివాసితులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీసు శాఖ సహకారంతో ఈట్ స్ట్రీట్‌కు కుటుంబంతో వచ్చేలా నిర్వహిస్తామని తెలిపారు. రాత్రిళ్లు పని చేసే మార్కెట్, ముఠా కార్మికులకు ఆహారం అందుబాటులో ఉండడంతో పాటు, చిరు వ్యాపారులకు ఆదాయ వనరుగా కూడా దోహదపడుతుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా, కార్పొరేటర్ యాట్ల రవి, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కరరావు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి రూ.1,11,116 విరాళం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాతలు గురువారం రూ.1,11,116 అందజేశారు. విజయవాడకు చెందిన జయకృష్ణ, కుసుమ దంపతులు విరాళాన్ని అందించారు. దాతలను శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి బహూకరించారు.

లారీలకు జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళుతున్న లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గుర్తించి జరిమానా విధించారు. కొల్లిపరలో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తన సిబ్బందితో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. మూడు లారీలు అధిక లోడుతో వెళ్తుండటాన్ని గుర్తించారు. ఒక లారీకి రూ. 25 వేలు, రెండు లారీలకు రూ. తొమ్మిది వేలు చొప్పున జరిమానా విధించారు.

రేషన్ పంపిణీలో అక్రమాలపై చట్టపరమైన చర్యలు



కొల్లిపర: రేషన్ సరుకులు పంపిణీలో అక్రమాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తహసీల్దార్ జి.నాంచారయ్య ఎండీయూ ఆపరేటర్లను, రేషన్ షాపు డీలర్లను హెచ్చరించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా ఇంటింటి సరఫరా ఖచ్చితంగా జరగాలన్నారు. రేషన్ సరుకులు అందలేదని లబ్ధిదారుల వద్ద నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుకోవటం జరుగుతుందన్నారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ జేవీఎస్ఎన్ మూర్తి, ఆర్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దాం



తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దామని గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జొన్నా శివశంకరరావు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో రైతు సంఘం నాయకులతో కలసి మహాధర్నా కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కర్షక, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా ఈనెల 27, 28 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల పొట్ట కొట్టిందని ఆయన విమర్శించారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులు చేసి కనీస వేతనం రూ.600 నిర్ణయించి, ఉపాధి కల్పించాలనే తదితర డిమాండ్లతో ఈనెల 27వ తేదీ విజయవాడలో జరిగే కర్షక, కార్మిక మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, దాసరి రమేష్ పాల్గొన్నారు.

సంగీత విజ్ఞాన సర్వస్వం 'మంగళంపల్లి'



లక్ష్మీపురం: తన అనంత గానామృతంతో సంగీత అభిమానులు గుండెల్లో కొలువైన అద్భుత వాగ్గేయ కారుడు, సంగీత విజ్ఞాన సర్వస్వం మంగళంపల్లి బాలమురళీకృష్ణ అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం బాలమురళీకృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆయన పలుకే బంగారమని తెలిపారు. సరిగమల సింగారం చేసిన వాగ్గేయకారుడుగా పేర్కొన్నారు. సాంస్కృతి కో–ఆర్డినేటర్ బిళ్లా ఆశోక్ మాట్లాడుతూ గోదారి తీరాన పుట్టిన ఆ సంగీత బ్రహ్మ తన స్వరదారతో యావత్ దేశాన్ని పులకింపజేశారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు టి.సాయిబాబు, వి.వి.రావ్, పద్మభూషణ్ పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



అత్తోట గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

అత్తోట(కొల్లిపర): పేద ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి అన్నారు. అత్తోట గ్రామ సచివాలయం పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమం పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనేతలు కలసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు చేకూరిన లబ్ధి జాబితా బోర్డులు ప్రదర్శించారు. అనంతరం వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అత్తోట గ్రామ సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ.50.42 కోట్లను అందించటం జరిగిందన్నారు. ప్రజలంతా రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ దేశబోయిన నాగపునేశ్వరరావు, ఎంపీటీసీ బొల్లిముంత పోతురాజు, భీమవరపు సంజీవరెడ్డి, పరిపాలన ఏవో వి.చంద్రమోహన్, ఈవోపిర్డీ పూర్ణ శంకరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపుతున్న ఎమ్మెల్యే



ఎంపీపీ చెన్నకేశవులును సత్కరిస్తున్న శ్రీనివాసరావు

తెనాలిటౌన్: సామాజిక న్యాయాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్న నాయకులు తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అని జిల్లా రజక సంఘ యువ నాయకుడు, కంచర్లపాలెం వైఎస్సార్‌సీపీ గ్రామ సమన్వయకర్త పాదిలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెనాలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ధర్మరాజుల చెన్నకేశవులును గురువార కొత్తపేటలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రజక సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీని శాలువాలు పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెనాలి మండల రాజకీయ చరిత్రలో తొలిసారిగా రజక సమాజికి వర్గానికి చెందిన చెన్నకేశవులును ఎంపీపీ చేసిన శివకుమార్‌ను నియోజకవర్గంలోని రజకులు గుండెల్లో పెట్టుకుంటారని అన్నారు.. ఇచ్చిన మాట ప్రకారం తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళ తాడిబోయిన రాధికకు, ఎంపీపీగా రజక వర్గానికి చెందిన వారికి ఇచ్చిన ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని బీసీ కులస్థులంతా ఆయనకు రుణపడి ఉంటారన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా సమిష్టిగా శివకుమార్ విజయానికి కృషి చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రావులపాటి అనిల్, దుర్గాప్రసాద్, రజక సంఘ నేతలు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజ్ యూత్ రెడ్‌క్రాస్ విభాగం సహకారంతో గురువారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని కాలేజ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ ప్రారంభించారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) ఐపీఏ స్టూడెంట్ ఫోరం, ఐపీఏ ఏఎస్ఎన్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కాలేజి యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థులు మొత్తం 48 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఏటా క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్న విద్యార్థులను ఎమ్మెల్యే శివకుమార్ అభినందించారు. రెడ్‌క్రాస్ తెనాలి శాఖ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి మాట్లాడుతూ రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలను నిలబెట్టవచ్చన్నారు. కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ వై.ఫణికృష్ణ పర్యవేక్షించారు. స్టూడెంట్ ఫోరం అధ్యక్షుడు సునీల్‌కుమార్, ఎడిటర్ షాలేంరాజు, వెంకట్‌ప్రసాద్, సభ్యులు సుష్మ, గీత, కీర్తి, హిమజ, సుప్రియ, రోహిత్, దిలీప్, బీఫార్మసీ, ఫార్మాడీ విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా జయంతి వేడుకలు



సత్యసాయిబాబా చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళి

తెనాలిటౌన్: చెంచుపేటలోని శబరి వృద్ధాశ్రమంలో గురువారం భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సత్యసాయి బాబా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సాయిబాబా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు, బాబా భక్తులకు అందజేశారు. బాబా చేసిన సేవలకు భక్తులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు సత్యసాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయిబాబా జయంతి

తెనాలిటౌన్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకలను గురువారం వైభవంగా జరిపారు. రామలింగేశ్వరపేట రాజులకాలనీలో సత్య సాయి బాబా మందిరంలో బాబా జయంతి నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన, బాబావారి పాదుకల ఊరేగింపుతో వేడుకలు ప్రారంభించారు. సత్య సాయి మహిళా మండలి వారి అఖండ భజన, హారతి, ఉయ్యాల సేవలను విశేషంగా జరిపారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర భట్రోజు సంఘ అధ్యక్షుడు చక్రాల ఫకీర్‌రాజు మాట్లాడుతూ పరమశివుని అవతారంగా కొలిచే సత్యసాయిబాబా భట్టు జాతిలో జన్మించడం బట్టు జాతి అదృష్టమన్నారు. ప్రతి ఒక్కరికి బాబా కృప ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం రాజులకాలనీ అభివృద్ధికి కృషి చేసిన తంగెళ్ల శేషంరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మందిరంలో సాయిబాబా, షిర్డిసాయి చిత్రపటాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో గంగరాజు, కూరపాటి కొండంరాజు, రామరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ కె.కుష్మా కిషోర్, ఆంజనేయరాజు, తంగెళ్ల సత్యనారాయణరాజు, వీరభద్రరాజు, సరికొండ రమాదేవి, శివశంకరరాజు, జయశంకరరాజు, చక్రాల శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. సుల్తానాబాద్‌లోని ఆలపాటినగర్‌లో సద్గురు సత్యసాయిబాబా జయంతిని సాయి మందిరంలో జరిపారు. బెలూన్లతో సాయిబాబాను అలంకరించారు. పుట్టపర్తిలో మాదిరిగా ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రబీలో ప్రత్యామ్నాయ పంటలు వేయండి

తాడేపల్లిరూరల్: రైతులు రబీ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటలు వేయాలని మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు గాయం శ్రీనివాసరెడ్డి, తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాసులు సూచించారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు రైతు భరోసా కేంద్రంలో రైతుల కోసం ప్రత్యేక గ్రామ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ రబీ సీజన్‌లో కాలువల ద్వారా నీరు విడుదల లేని దృష్ట్యా మొక్కజొన్న, జొన్న పంటలకు బదులుగా మినుము, పెసర, శనగ పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు మినుము, పెసర విత్తనాలను అందజేశారు.

దుగ్గిరాలలో మండలంలో....

దుగ్గిరాల మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో గురువారం వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి వ్యవసాయ అధికారి పి.శిరీష విచ్చేసి రైతులతో మాట్లాడుతూ రబీ సమయంలో రెండో పంటకు నీరు తక్కువగా ఉన్నందున రైతులు పెసర, మినుము పంటలను సాగు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఈవో ఎ.రమేష్ పాల్గొన్నారు.